క్లుప్తంగా

మొక్కలు నాటి సంరక్షించాలి



స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు సీజే.శ్రీపూజిత అన్నారు. జిల్లా కేంద్రం 48వ వార్డు క్రిస్టియన్‌కాలనీలోగల కమ్యూనిటీహాల్‌లో శుక్రవారం 75వ మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పలువురికి మొక్కలు పంపిణీ చేశారు. వార్డు అధికారి యాదమ్మ, ఆర్‌పీ దివ్య, ఈసీ అంజమ్మ, నాజియ, జయశీల తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.12వేలు ఇవ్వాలి



జడ్చర్ల టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.12వేలు ఇవ్వాలని శుక్రవారం జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సత్యనారాయణరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య మాట్లాడారు. బిల్లులు వెంటనే ఇప్పించాలన్నారు. అంగన్‌వాడీలకు మాదిరిగానే పాఠశాలలకు గుడ్లు సరఫరా చేయాలన్నారు. కార్మికులు కౌసల్య, పద్మ, అంజమ్మ, లక్ష్మమ్మ, స్వప్న, అనిత, షబానా, మంగమ్మ పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు వర్తింపజేయాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: గత ప్రభుత్వ హయాంలో ఈఎస్ఎస్ పథకం కింద మంజూరై పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులకు వంద శాతం సబ్సిడీ రుణాలు, కుట్టుమిషన్లను అందజేసేలా చర్యలు తీసుకోవాలని.. ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ రాష్ట్ర కార్యదర్శి మిర్జా ఖుద్దూస్ బేగ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలో చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో 250 కుట్టు మిషన్లు, 160 మంది లబ్ధిదారులకు రూ.లక్ష ఆర్థికసాయం మంజూరయ్యాయని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు.

మల్లన్నగుట్టను కాపాడండి



నవాబుపేట: కొల్లూర్‌కి చెందిన మల్లన్నగుట్ట (ప్రభుత్వ భూమి)ని కాపాడాలని ఆలయ పూజారి జంగం ప్రదీప్(వంశ పారంపర్య పూజారి) తదితరులు కలెక్టర్ విజయేందిరకు శుక్రవారం వినతిపత్రం అందించారు. మల్లన్న గుట్టలో శివుడు స్వయం భూగా వెలిశాడన్నారు. ప్రజలు ప్రత్యేక పూజలు చేస్తారని తెలిపారు. తాజాగా గుట్టను గ్రామానికి చెందిన చిన్నయ్యస్వామి, ఆలయ పూజారి నందీశ్వర్ స్వామి.. సేవాసమితి పేరుతో ట్రస్టు ఏర్పాటు చేసి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపించారు. విచారణ జరిపి మల్లన్నగుట్టను గ్రామానికి చెందిన ఆస్తిగా భావించి.. ఎవరి ట్రస్టుపేరుతో కేటాయించకుండా చూడాలని కోరారు.

45 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి



మహబూబ్‌నగర్ రూరల్: దేశంలో 60 శాతానికి పైగా బడుగు, బలహీన వర్గాల ప్రజలు జీవనం సాగిస్తున్నారని బీసీ మేధావుల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.పాండురంగం, ప్రధాన కార్యదర్శి ఎన్.ప్రభాకర్ అన్నారు. జనాభాకు తగ్గట్టుగా 45 శాతానికి పైగా బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని శుక్రవారం డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో స్థానిక బీసీ స్టడీ సర్కిల్ ఆవరణలో ఉన్న జ్యోతిరావు పులే విగ్రహానికి, సాహు మహరాజ్ చిత్రపటానికి వినతిపత్రాలు అందజేశారు. మహిళా విభాగం అధ్యక్షురాలు వనజ, వెంకట్రాములు, భాస్కరయ్య, రాంచందర్‌జీ, మల్లికార్జున్, స్వప్న, శాంతి, సుశీల, రుక్మిణి పాల్గొన్నారు.

ఐటీఐలో మూడో దశ సీట్ల భర్తీ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని ఐటీఐ ప్రభుత్వ కళాశాలలో మూడో దశ సీట్ల భర్తీకి ప్రభుత్వం అనుమతించినట్లు ప్రిన్సిపాల్ శాంతయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 14 సంవత్సరాలు నిండి, విద్యార్హతలు ఉన్నవారు ఆన్‌లైన్ ఈ నెల 12లోగా దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు.

పర్యావరణ రక్షణకు ప్రాధాన్యం



దేవరకద్ర రైతువేదికలో సమావేశంలో పాల్గొన్న అధికారులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కౌన్సిల్ సమావేశ మందిరంలో అధికారులు, సిబ్బంది, వార్డు ఆఫీసర్లతో అవగాహన సదస్సు నిర్వహించారు. పలు సూచనలు చేశారు. కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, ఏఎంసీ జె.పవన్‌కుమార్, ఎంఈ యు.బస్వరాజ్, డీఈఈ సందీప్‌కుమార్, ఏఈలు హరికృష్ణ, వైష్ణవి, ముస్రత్ మోహినుద్దీన్, టీపీఓ లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమాన్ని ఈనెల 5 నుంచి 9 వరకు నిర్వహించనున్నట్లు చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్, మండల ప్రత్యేక అధికారి కె.రవీందర్ తెలిపారు. శుక్రవారం జెడ్పీ సమావేశ మందిరంలో ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమావేశంలో మాట్లాడారు. ప్రతి గ్రామంలో పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించాలని సూచించారు.



మాట్లాడుతున్న పాలమూరు మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్

ఎంపీడీఓ కరుణశ్రీ, తహసీల్దార్ సుందర్‌రాజ్, ఎంపీఓ శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: మండల పరిధిలో ఈ నెల 5 నుంచి నిర్వహించే స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమం జయప్రదం చేద్దామని ఎంపీడీఓ విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల అధికారులు, జీపీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు, బుక్ కీపర్స్‌తో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములు చేయాలని సూచించారు. పల్లె ప్రకృతివనంలో పాడైన వాటి స్థానంలో కొత్తమొక్కలను నాటాలన్నారు. ట్యాంకులు శుభ్రం చేయటం, పారిశుద్ధ్యం కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలన్నారు. తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, ఎంపీఓ సరోజ, ఏపీఓ విజయభాస్కర్‌రెడ్డి, పీఆర్ ఏఈ జవహర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర: మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, స్పెషల్ ఆఫీసర్ రామిరెడ్డి, కౌకుంట్ల స్పెషల్ ఆఫీసర్ భాస్కర్, దేవరకద్ర తహసీల్దార్ శ్రీనివాసులు, కౌకుంట్ల తహసీల్దార్ ఎల్లయ్య, ఏఓ రాజేందర్ ఆగర్వాల్, ఏఈ కీర్తి, వైద్యాధికారి శరత్, గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కోయిల్‌కొండ: మండలం నిర్వహించిన సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ మధుసూదన్‌గౌడ్, ఇరిగేషన్ ఈఈ అబ్దుల్‌బారి, ఏఓ రాంపాల్, సూపర్‌డెంట్ హరిశ్చంద్రారెడ్డి, ఎంపీఓ నజీర్‌హైమద్, ఏపీఓ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల: మూసాపేట, అడ్డాకుల మండల కేంద్రంలోని రైతు వేదికల్లో కార్యక్రమాల్లో ఎంపీడీఓలు శ్రీనివాస్, కృష్ణయ్య, తహసీల్దార్లు మదన్‌మోహన్‌గౌడ్, బ్రహ్మంగౌడ్, ఏఓలు పి.శ్రీనివాస్, రాజేందర్‌రెడ్డి, సూపరింటెండెంట్ శివప్రసాద్, ఎంపీఓ అనురాధ, ఏపీఎం సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

నవాబుపేట: మండలంలో స్పెషల్ అధికారి పద్మ, ఎంపీడీఓ జయరాంనాయక్, తహసీల్దార్ నాన్యనాయక్, ఏఓ కృష్ణకిశోర్, ఏపీఎం జ్యోతీ తదితరులు ఉన్నారు.

ప్రిన్సిపాల్‌గా తిరుపతయ్య

మిడ్జిల్: ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా తిరుపతయ్య బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం కళాశాల వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు, దాతల సహకారంతో కళాశాలను అభివృద్ధి పరుస్తామని తెలిపారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి హయాంలో అన్ని వర్గాల అభివృద్ధి

స్టేషన్ మహబూబ్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో అన్ని వర్గాలు అభివృద్ధి చెందుతున్నారని అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా అన్నారు. జిల్లా కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్‌లో మైనార్టీల సంక్షేమానికి రూ.3003 కోట్లు కేటాయించడం హర్షణీయమన్నారు. సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. ఉర్దూ మీడియం పాఠశాలలు, మైనార్టీ గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని, ఉర్దూ భాషను మండల స్థాయి నుంచి సెక్రటేరియట్ వరకు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాన కార్యదర్శి మహ్మద్ యాఖూబ్ తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ప్రారంభం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 19వ వార్డు పరిధిలోని టీచర్స్ కాలనీలో ఏర్పాటుచేసిన హైమాస్ట్ లైట్లను శుక్రవారం రాత్రి మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, కాలనీవాసులు ఎక్బాల్, ఎం.డి.సుల్తాన్, జఫరుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

అడ్డాకుల: మూసాపేట మండలం చక్రాపూర్ స్టేజీ సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన రఘురాములు కుమారుడు అశోక్‌కుమార్ తన కారును భూత్పూర్‌లో పెట్టి అక్కడి నుంచి ద్విచక్రవాహనంపై ఊరికి వస్తున్నాడు. ఈక్రమంలో జానంపేట శివారులోని ఎల్లమ్మ దేవాలయం దాటిన తర్వాత వెనుక నుంచి వచ్చిన మరో ద్విచక్రవాహనం అశోక్‌కుమార్ బైక్‌ను ఢీకొట్టింది. ఘటనలో అతడి కుడి కాలుకు ఫ్రాక్చర్ అయింది. అదేవిధంగా మరో ద్విచక్రవాహనంపై ఉన్న ఇమ్రాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కాగా ఇమ్రాన్‌తో పాటు బైక్‌పై ఉన్న మహిళ స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడింది.

శాంతీయుత మార్గం అనుసరించాలి

కోయిల్‌కొండ: యువత శాంతీయుత మార్గం అనుసరించాలని ప్రముఖ గాంధేయవాది జి.వి సుబ్బారావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాజీ డీఈఓ విజయ్‌కుమార్‌తో కలిసి మాట్లాడారు. గాంధీ స్వరాజ్య స్థాపనకు.. మాజీ డీఈఓ విజయ్‌కుమార్ అక్టోబర్2న అలంపూర్ నుంచి ఉమ్మడి పాలమూరు జిల్లాలో బాపు బాట పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లా విద్యావేత్తలు, విద్యార్థులు విజయవంతం చేయాలని కోరారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

పాలమూరు: చిన్నారుల కంటి చూపు మెరుగుపరచడానికి ఉచిత కంటి వైద్య శిబిరాలు ఉపయోగపడుతాయని పాలమూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బాలరాజు, కార్యదర్శి గిరి ప్రసాద్‌రెడ్డిలు అన్నారు. రాంరెడ్డి ఆస్పత్రి– పాలమూరు లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో.. శుక్రవారం పట్టణంలోని ఏనుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచితంగా పరీక్షలు అవసరం అయిన వారికి అద్దాలు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ సేవలు విస్తృతం చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు చాలా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బాల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెను ప్రకారం భోజనం పెట్టాలి

మహబూబ్‌నగర్ రూరల్: సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని డీఆర్‌ఓ రవికుమార్‌కు కేవీపీఎస్ జిల్లా కమిటీ తరపున శుక్రవారం వినతిపత్రం అందజేశారు. జిల్లాలో జూలై 20 నుంచి 31వ తేదీ వరకు 10 వసతిగృహాలు, రెండు కళాశాల వసతిగృహాల్లో కేవీపీఎస్ ఆధ్వర్యంలో సర్వే చేశామన్నారు. ఈ సందర్భంగా తెలియవచ్చిన సమస్యలను డీఆర్‌ఓ దృష్టికి తీసుకువచ్చినట్లు వివరించారు. విద్యార్థులకు నాసిరకం భోజనం పెడుతున్నారని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఉన్నత పాఠశాల విద్యార్థులకు చార్జీలు రూ. 950 నుంచి రూ. 2000 వరకు, కళాశాల స్థాయి విద్యార్థుల మెస్ చార్జీలు రూ. 1500 నుంచి రూ. 2500లకు పెంచాలని.. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కోరారు. వానా కాలంలో వసతిగృహ విద్యార్థులు అనేక రోగాల బారిన పడుతున్నారని, వసతిగృహాలకు మెడికల్ కిట్ (జ్వరం, దగ్గు, జలుబు, కడుపునొప్పి, వాంతులు) వంటి వాటికి మందులు పంపాలని తెలిపారు. విద్యాసంస్థలు పునః ప్రారంభమై 50 రోజులు కావస్తున్నా నేటికీ ప్లేట్లు, గ్లాసులు, దుప్పట్లు, బ్యాగులు ఇవ్వలేదని, ట్యూషన్ ప్రారంభం కాలేదని అన్నారు. కార్యదర్శి ఎం.కుర్మయ్య, పట్టణ కార్యదర్శి ఆది విష్ణువర్ధన్, నాయకులు మనోహర్ తదితరులు ఉన్నారు.



సర్వే పత్రాలను అందజేస్తున్న నాయకులు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేస్తున్న విద్యార్థులు

దేవరకద్ర: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులు తహసీల్దార్ కార్యాయం ముట్టడించారు. అక్కడే బైఠాయించి ధర్నా చేపట్టారు. పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారాం మాట్లాడారు. కళాశాలలో మధ్యాహ్న భోజన అమలు చేయాలన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, రియంబర్స్‌మెంట్లను విడుదల చేయాలని కోరారు. అదేవిధంగా సీఎం ఎన్నికల సమయంలో విద్యారంగానికి సంబంధించి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో 30 శాతం విద్యారంగానికి కేటాయించాలన్నారు. ఉచిత బస్‌పాస్ సౌకర్యం, ఎస్సీ, బీసీ హాస్టల్స్ తదితరాలను ఏర్పాటు చేయాలంటూ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీటీ దీపికకు అందజేశారు. జిల్లా కోశాధికారి శివకుమార్, నాయకులు నరేష్, రమేష్, రాజు, బాలేశ్వరి, నందిని, సుజాత, సోని తదితరులు పాల్గొన్నారు.

సీఎంతో సమావేశానికి తరలిన ఉపాధ్యాయులు

జడ్చర్ల టౌన్: హైదరాబాద్ ఎల్‌బీస్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి జడ్చర్ల మండలంలో పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు శుక్రవారం బయలుదేరి వెళ్లారు. ఈ మేరకు ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఎంఈఓ మంజులాదేవి జెండా ఊపి వారు వెళ్లే బస్సును ప్రారంభించారు. కాంగ్రెస్ హయాంలో తమకు బదిలీతోపాటు పదోన్నతులు రావటంపై ఉపాధ్యాయులు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు.



సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం



భూత్పూర్‌లో హర్షం వ్యక్తం చేస్తున్న నాయకులు

భూత్పూర్: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై అత్యున్నత న్యాయస్థానం తీర్పు చారిత్రాత్మకమని ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలోని చౌరస్తాలో డా.బీఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేశారు. మంద కృష్ణ మాదిగ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. బీజేపీ రాష్ట్ర నాయకులు సుదర్శన్‌రెడ్డి, ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షుడు మేతరి రాము, మండల అధ్యక్షుడు శరబంద, కాంగ్రెస్‌నాయకుడు బోరింగ్ నర్సింహులు, బీఆర్ఎస్‌నాయకుడు డీలర్ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల: కందూర్‌లో బీజేపీ దళిత మోర్చా ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. జిల్లా కార్యదర్శి కాటవరం శంకర్, వెంకటయ్య, మహేష్, రామకృష్ణ, రవి, నాగరాజు తదితరులు ఉన్నారు. సుప్రీంకోర్టు తీర్పు హర్షనీయమని బీజేపీ మాజీ జిల్లా అధికార ప్రతినిధి మున్నూర్ రమేష్ పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

దేవరకద్ర: సుప్రీం తీర్పు చారిత్రాత్మకం అని జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు సాయిబాబ అన్నారు. శుక్రవారం దేవరకద్రలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు రాము పాల్గొన్నారు.

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టులు



భూత్పూర్‌లో అరెస్టయిన మాజీ సర్పంచులు

మహబూబ్‌నగర్ రూరల్: మండల మాజీ సర్పంచ్‌లను పోలీసులు శుక్రవారం ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

భూత్పూర్: మాజీ సర్పంచులను భూత్పూర్ పోలీసులు శుక్రవారం ముందుస్తుగా అరెస్టు చేసి పోలీస్టేషన్‌కు తరలించారు. కేటీఆర్ మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని శుక్రవారం పిలుపునివ్వడంతో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సొంత పూచీ కత్తుపై విడుదల చేశారు. అరెస్టయిన వారిలో మాజీ సర్పంచులు ఆకుల వెంకటయ్య, యాదయ్య, ఆంజనేయులు, బోల శేఖర్ తదితరులు ఉన్నారు.

హన్వాడ: మండలంలో బీఆర్ఎస్ నాయకులను, మాజీ సర్పంచ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సొంత పూచీకత్తుపై వదిలేశారు.

నవాబుపేట: మండలంలో మాజీ సర్పంచ్‌లను ముందస్తుగా ఆరెస్టు చేసినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు. కాగా అరెస్టయిన వారిలో అమ్మపూర్ సత్యం, నర్సింహనాయక్, సత్యం, వెంకటేష్, కృష్ణ, పురుషోత్తం తదితరులు ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్



అడుగుకో గుంత

మండల పరిధిలోని లింగంపల్లి నుంచి బాలానగర్ వెళ్లే పంచాయతీ రాజ్ పరిధిలోని రోడ్డు అధ్వానంగా మారింది. కిలోమీటర్ల మేర అడుగుకో గుంత దర్శనమిస్తోంది. దీంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. మరీ ముఖ్యంగా వర్షాల నేపథ్యంలో ఈ గుంతల్లో నీరు నిండి ఉండడంతో అవస్థలు ఎదుర్కొంటున్నారు. వాహనాలు అదుపు తప్పుతుండడంతో గాయాలపాలవుతున్నారు. కొందరైతే భయంతో చుట్టూ తిరిగి వేరే దారుల ద్వారా గ్రామానికి చేరుకుంటున్నారు. అధికారులు ఇప్పటికైనా రోడ్డును బాగుచేయించాలని కోరుతున్నారు. –నవాబుపేట

సంప్రదించవలసిన అధికారి: వెంకటేశ్వర్‌రెడ్డి, పంచాయతిరాజ్ శాఖ, డీఈ, సెల్: 94409 30588

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిడ్జిల్: మండల కేంద్రంలోని 132 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతు నిర్వహించనున్నారు. ఈ మేరకు శనివారం మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని ఏఈ జ్ఞానసుందర్ తెలిపారు. మండలంలోని అన్ని 33 కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలోనూ సరఫరా ఉండదని వివరించారు.

ప్రపుల్ల చంద్రరాయ్ జయంతి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో భారత రసాయనశాస్త్ర పితామహుడు ప్రపుల్ల చంద్రరాయ్ జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈమేరకు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. చంద్రరాయ్ టీచర్‌గా, పరిశోధకుడిగా, విద్యా, పారిశ్రామికవేత్తగా ఎన్నో ఘనతలు సాధించారని.. యువతకు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అధ్యాపకులు అనిత, ప్రకాష్, హరిబాబు, కళమ్మ, మార్కండేయా తదితరులు పాల్గొన్నారు.

ఇసుక వాహనాల సీజ్

నవాబుపేట: కారూర్ వాగులో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్, ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు. ఎలాంటి అనుమతి లేకుండా ఈ వాహనాలు ఇసుక తీసుకెళ్తున్నట్లు సమాచారం అందినట్లు వివరించారు. శుక్రవారం తమ సిబ్బంది వెంబడించి గ్రామ సమీపంలో వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. డ్రైవర్లు పరారు కాగా.. వాహనాల నంబర్ల ఆధారంగా యజమానులపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

దుస్తుల పంపిణీ

పాలమూరు: జిల్లా కేంద్రంలోని ఏనుగొండలో ఉన్న రెడ్‌క్రాస్ అనాథ శరణాలయంలో శుక్రవారం దుస్తుల పంపిణీ నిర్వహించారు. రెడ్‌క్రాస్ వైస్‌చైర్మన్ కుమార్తె డాక్టర్ టీనా జన్మదినం సందర్భంగా కార్యక్రమం చేపట్టారు. నూతన దుస్తులు అందించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్, డాక్టర్ శ్యాముల్, సూపరింటెండెంట్ వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలి

చిన్నచింతకుంట: ప్రభుత్వం ఎన్నికల హామీలను వెంటనే నెరవేర్చాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ మండల కమిటీ కార్యదర్శి జేఎన్ దేవదానం డిమాండ్ చేశారు. శుక్రవారం చిన్నచింతకుంటలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. తహసీల్దార్ కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివుడు, చంద్రన్న, కొండన్న, రాజు, నర్సింహులు, అడివన్నతో పాటు పలువురు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి కృషి



మహబూబ్‌నగర్ రూరల్: మహిళా అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని మండల మహిళా సమైక్య భవనంలో శుక్రవారం కాజ మిషన్, బటన్ మిషన్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అభివృద్ధి చెందినప్పుడే సమాజం బాగుంటుందని, అందుకే ప్రభుత్వం మహిళా సాధికారిత కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదని అన్నారు. అంతకుముందు మహిళా సమైక్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నర్సింలు, రూరల్ మండల ఎంపీడీఓ కరుణ, ఏపీఓ మాధవి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, మల్లు నరసింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని మేకలబండకు మంజూరైన చౌకధర దుకాణం (నంబర్38)ను శివశక్తినగర్‌లో ఎమ్మెల్యే ప్రారంభించారు.

వాసవీమాతకు ప్రత్యేక అలంకరణ



జడ్చర్ల టౌన్: ఆషాఢమాసం పురస్కరించుకుని పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేక పూలాలంకరణ చేశారు. ముందుగా అమ్మవారికి అభిషేకాలు చేశారు. అనంతరం పూలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. శుక్రవారం పురస్కరించుకుని మహిళలు సామూహిక కుంకుమార్చన, పల్లకీసేవ చేపట్టారు.

దేవరకద్ర: మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆషాఢ మాసం చివరి శుక్రవారం సందర్భంగా ఘనంగా పూజలు నిర్వహించారు. వాసవీమాతకు ప్రత్యేక అలంకారం చేశారు. సామూహిక పుష్పార్చన, కుంకుమార్చన, పల్లకీసేవ చేపట్టారు.

వైభవంగా రంగనాయక ఆలయ సంప్రోక్షణ



జడ్చర్ల టౌన్: బాదేపల్లి పెద్దగుట్టపై శుక్రవారం రంగనాయకస్వామి ఆలయ సంప్రోక్షణ వైభవంగా నిర్వహించారు. రంగనాయక పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు కాల్వ రాంరెడ్డి ఆధ్వర్యంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రాయశ్చిత్త పూర్వక మహాసంప్రోక్షణ చేపట్టారు. ఉదయం 7గంటలకు విశ్వక్సేన ఆరాధనతో సంప్రోక్షణ ప్రారంభమై శ్రీవాసుదేవ పుణ్యాహవాచనం, రక్షాబంధనం, నవకలశ స్నపనం, అలంకరణ ఊరేగింపు, అగ్నిప్రతిష్ఠ, మూలమంత్ర శ్రీసుదర్శన శతక పారాయణ హవన క్రతువులు నిర్వహించారు. పవిత్ర గంగాజలంతో లక్ష్మీసమేత రంగనాథస్వామి విగ్రహానికి అభిషేకం చేశారు. గుట్టపైనే హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. హోమంలో రాంరెడ్డి–రాధిక, వేణుగోపాల్–లావణ్య దంపతులు పాల్గొన్నారు.

వాడవాడలా 'డ్రై' డే



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణ పరిధిలోని 49 వార్డులలో వాడవాడలా శుక్రవారం 'డ్రై' డే నిర్వహించారు. వార్డు ఆఫీసర్ల ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి నీటి సంప్‌లు, డ్రమ్ములను పరిశీలించారు. ఎక్కువ రోజులు నీరు నిల్వ చేయొద్దని సూచించారు. అలాగే కొన్ని చోట్ల రోడ్డు పక్కన చెత్త వేయకుండా వివిధ రంగులతో ఆకర్షణీయంగా ముగ్గులు వేశారు. ముఖ్యంగా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని ప్రజలకు అవగాహన కల్పించారు. పారిశుద్ధ్య కార్మికులతో మోరీలను శుభ్రపరిచి బ్లీచింగ్ పౌడర్‌తో పాటు రసాయనాలు పిచికారీ చేయించారు.

వయనాడ్ బాధితులను ఆదుకుందాం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: వయనాడ్ వరద బాధితుల సహాయార్థం సీపీఎం ఆధ్వర్యంలో మొదటిరోజు శుక్రవారం రూ.11,400 విరాళాలు సేకరించారు. ముందుగా మహబూబ్‌నగర్ జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.సంపత్‌కుమార్‌సింగ్ రూ.2,500 అందజేయగా.. మరికొందరు వైద్యులు, ఉద్యోగులు ముందుకు వచ్చి ఉదారంగా విరాళాలు ఇచ్చారని పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రాములు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నల్లవెల్లి కురుమూర్తి, పార్టీ సీనియర్ నాయకులు కిల్లె గోపాల్, చంద్రకాంత్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.